సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం । 5 । ఏప్రిల్ । 2025



అపర భద్రాద్రి సిర్సనగండ్ల

సిర్సనగండ్ల ఆలయంలో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సంతోష్ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.8 /21.1

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

దొడ్డు బియ్యంతో దందా

అక్రమార్కులకు కలిసొచ్చిన సన్నబియ్యం పంపిణీ



కొత్తపేటలోని రైస్‌మిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యం సంచులు

- ఇప్పటికే ఎక్కడికక్కడ దొడ్డు బియ్యం డంపు చేసిన మిల్లర్లు
- పాతవి స్టాక్ పాయింట్లకు తరలించకుండా దందా
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి
- తాజాగా పెద్దకొత్తపల్లి మండలంలోని ఓ రైస్‌మిల్లులో 300 క్వింటాళ్ల దొడ్డు బియ్యం స్వాధీనం

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. తద్వారా ఇప్పటి వరకు కొనసాగుతున్న రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందాకు తెరపడుతుందని భావిస్తుండగా.. ఇప్పటికే టన్నుల కొద్దీ పోగు చేసుకున్న పాత బియ్యంతో అక్రమార్కులు యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. పాత దొడ్డు బియ్యాన్ని నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్టాక్ పాయింట్లు, ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా.. ఎక్కడికక్కడ నిల్వ చేసుకుని, అక్రమ రవాణా చేస్తున్నారు. శుక్రవారం జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండలం కొత్తపేటలో ఉన్న రైస్‌మిల్లులో 300 క్వింటాళ్ల దొడ్డు బియ్యాన్ని అధికారులు పట్టుకోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

సీజ్‌చేసిన మిల్లులో..

పెద్దకొత్తపల్లి మండలంలోని కొత్తపేట బాలాజీ రైస్ మిల్లు గతంలో సీఎమ్మార్ కింద బియ్యం ఇవ్వకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. అయితే ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా, అక్రమ దందా చేయడంతో సీజ్ చేసినప్పటికీ మళ్లీ దందా కొనసాగిస్తుండటం గమనార్హం. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డీసీబీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ రైస్‌మిల్లుపై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో రైస్‌మిల్లులో 600 బస్తాల్లో నిల్వ చేసిన 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ మిల్లు కేంద్రంగా పెద్దఎత్తున రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వచేస్తూ దందా చేస్తున్న మిల్లు యజమాని సునీల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

అందని మార్గదర్శకాలు..

ప్రభుత్వం ఈ నెల 1 నుంచి రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభమైంది. అయితే ఇప్పటికే ఉన్న పాత దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వ స్టాక్ పాయింట్లకు అప్పగించాల్సి ఉంది. కానీ, చాలాచోట్ల దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించారు. రేషన్ షాపులకు కేటాయించిన స్టాక్ మేరకు మిగిలిన బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకపోతే వారి నుంచి ఈ మేరకు డబ్బులు వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ రేటు కన్నా అధిక ధరలకు దొడ్డుబియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రైస్ మిల్లుల్లో కేటాయించిన మేరకు ప్రభుత్వానికి సీఎమ్మార్ ఇవ్వకుండా పెద్దఎత్తున రేషన్‌బియ్యాన్ని నిల్వ చేసుకుని సీఎమ్మార్‌గా చూపుతూ దందా సాగిస్తున్నారు.

ప్రభుత్వానికి అప్పగించాల్సిందే..

ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించింది. నిబంధనల ప్రకారం రేషన్ దుకాణాల వద్ద ఉన్న పాత బియ్యం స్టాక్‌ను ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. మిల్లుల్లోని దొడ్డు బియ్యాన్ని సైతం ఎఫ్‌సీఐకి అప్పగించాలి.

– రాజేందర్, పౌర సరఫరాల శాఖ మేనేజర్, నాగర్‌కర్నూల్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల రైస్‌మిల్లుల్లో పెద్ద ఎత్తున రేషన్‌బియ్యాన్ని నిల్వ చేస్తూ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు.

మిల్లు యాజమానిపై కేసు

పెద్దకొత్తపల్లి: మండలంలోని కొత్తపేట సమీపంలో ఉన్న బాలాజీ రైస్ మిల్లులో డీసీబీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏహెచ్‌పీ ఆనంద్‌కుమార్ దాడులు నిర్వహించి 600 బస్తాల దొడ్డు బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు పట్టుకున్న 300 క్వింటాళ్ల బియ్యాన్ని మండల కేంద్రంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన మిల్లు యాజమాని సునీల్ కుమార్‌పై కేసు నమోదు చేసి పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ తరలించినట్లు అధికారులు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రవీందర్, తహసీల్దార్ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సీజ్ చేసిన బాలాజీ రైస్ మిల్లు ఇదే..

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం : డీజీపీ



గద్వాల క్రైం: కేసుల నమోదు విషయంలో ఏ స్థాయి అధికారి అయినా నిర్లక్ష్యం.. అవినీతి, అక్రమ దందాల వ్యవహారంలో అంటకాగినట్లు బహిర్గతమైతే ఉపేక్షించేది లేదని రాష్ట్ర డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ప్రజలకు, యువతకు దిక్సూచిగా వ్యవహరిస్తూ.. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఉండాలని జిల్లా పోలీసు శాఖకు డీజీపీ దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలను వెల్లడించారు. గద్వాల, అలంపూర్ సెగ్మెంట్‌లలో ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులపై ప్రత్యేక బృందం విచారణకు శ్రీకారం చుట్టిందన్నారు. యువత బెట్టింగ్ యాప్‌ల ద్వారా తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్న ఘటనలు ప్రతి చోట వెలుగులోకి వస్తున్నాయని.. ఈ కేసుల విచారణకు సిట్ దర్యాప్తు చేస్తుందన్నారు. నడిగడ్డలో నమోదైన బెట్టింగ్ కేసుల నివేదికలను అందించాలని డీజీపీ ఆదేశించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు కావడంతో నిషేధిత మత్తు పదార్థాలు, ఇసుక, రేషన్ బియ్యం, మట్టి, నకిలీ విత్తనాలు, గంజాయి, గుట్కా తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. కృష్ణా, తుంగభద్ర నదీ తీర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు నిఘా పెంచాలన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. హిట్ అండ్ రన్ కేసులో సాధ్యమైనంత వేగంగా నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కల్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి.. రౌడీ షీట్ ఓపెన్ చేయాలన్నారు. మావోయిస్టు, ప్రభుత్వ వ్యతిరేకత అంశాలపై ద్వేషం, హింసాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా ఉంటే గుర్తించాలని సూచించారు.

9న కలెక్టరేట్ ముట్టడి



నాగర్‌కర్నూల్ రూరల్: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న కలెక్టరేట్‌ల ముట్టడి నిర్వహిస్తున్నామని సంఘం నాయకుడు వార్ల వెంకటయ్య అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే కలెక్టరేట్‌ల ముట్టడికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు జిల్లా సంఘం నాయకులు కృష్ణాజీ, అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి సూర్యశంకర్‌గౌడ్, నాయకులు చంద్రమౌళి, రైతు సంఘం నాయకులు కృష్ణయ్య, కొండన్నగౌడ్, నారాయణ, కుర్మయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సు

కొల్లాపూర్: పట్టణం నుంచి యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం ఉమాశంకర్ తెలిపారు. ప్రతిరోజూ కొల్లాపూర్ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బస్సు కల్వకుర్తి, ఆమనగల్, తుక్కుగూడ మీదుగా బయలుదేరుతుందని, మరుసటి రోజు తెల్లవారుజామున యాదగిరిగుట్ట నుంచి తిరుగు ప్రయాణం ఉంటుందని చెప్పారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగిరం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, పక్కన అదనపు కలెక్టర్లు దేవసహాయం, అమరేందర్

నాగర్‌కర్నూల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు దేవసహాయం, అమరేందర్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ జిల్లా అధికారులతో ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువవికాసం, తాగునీటిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలు అందరూ ఇల్లు కట్టుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వేసవికాలం యాక్షన్ ప్లాన్ ప్రకారం మున్సిపల్, పంచాయతీ, మిషన్ భగీరథ, ఎంపీడీఓలు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రజలకు తాగునీరు అందించాలని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పైపులైన్ లీకేజీ, మరమ్మతు వంటివి ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకం ద్వారా జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పారదర్శకంగా సన్నబియ్యం పంపిణీ

జిల్లాలో సన్నబియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. హైదరాబాద్ నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించామన్నారు. ఆదివారం వరకు వందశాతం అన్ని రేషన్ షాపులలో స్టాక్ ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. రేషన్ షాపుల దగ్గర సన్న బియ్యం పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొనడం జరిగిందని, సన్న బియ్యం అందుకున్న ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని మంత్రికి కలెక్టర్ వివరించారు.

సీతమ్మకు కీలక పదవి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా సీతా దయాకర్‌రెడ్డి
- మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- దయాకర్‌రెడ్డి కుటుంబానికి పెద్దపీట



సీఎం రేవంత్‌రెడ్డితో సీతాదయాకర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు (ఫైల్)

నారాయణపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన కొత్తకోట దయాకర్‌రెడ్డి కుటుంబానికి పదవి వరించింది. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఆమెతో పాటు మరో ఆరుగురు సభ్యులను నియమిస్తూ గురువారం ప్రభుత్వం జీఓ ఆర్టీ నంబర్ 45 జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం సీతా దయాకర్‌రెడ్డి హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్లపాటు బాలల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం కొనసాగనున్నారు. సీతా దయాకర్‌రెడ్డికి కీలక పదవి రావడంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, దయాకర్‌రెడ్డి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాభ్యాసం.. కుటుంబ నేపథ్యం

సీతాదయాకర్ రెడ్డి 1961 అక్టోబర్ 27న కామినేని రాజేశ్వరరావు, భారతి దంపతులకు నిజామాబాద్ జిల్లా సదాశివనగర్‌లో జన్మించారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ కళాశాలలో ఇంటర్ (1977–79), బీఏ (1979–82) పూర్తిచేశారు. 1982–84లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ సోషియాలజీ చదివారు. 1984 ఫిబ్రవరి 3న కొత్తకోట దయాకర్ రెడ్డితో సీతాదయాకర్ రెడ్డి వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు (సిద్ధార్థ, కార్తీక్) ఉన్నారు.

మక్తల్ టికెట్ ఆశించిన సమయంలో భరోసా..

దయాకర్‌రెడ్డి కుటుంబానికి మక్తల్, దేవరకద్రల్లో పెద్దఎత్తున అభిమానులు, మద్దతుదారులు ఉన్నారు. సీతమ్మ, దయాకర్ రెడ్డిలు పలు ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. రేవంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు సీతమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరడం.. కాంగ్రెస్ టికెట్ మక్తల్ నియోజకవర్గం నుంచి ఇవ్వాలని కోరారు. అయితే అధిష్టానం నిర్ణయం మేరకు బీసీ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి టికెట్ ఇస్తూ.. గెలిపించుకొని రావాలని, భవిష్యత్‌లో కీలక పదవి అప్పగిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ఎలాంటి రాజకీయ తప్పిదాలు జరగకుండా వాకిటి శ్రీహరి గెలుపులో కీలకపాత్ర పోషించి అధిష్టానం దృష్టిలో పడ్డారు.

టీడీపీని వీడుతూ కంటతడి..

సుదీర్ఘకాలం దయాకర్‌రెడ్డి దంపతులు టీడీపీలో కొనసాగారు. అయితే 2022లో వీరు టీడీపీని వీడారు. టీడీపీతో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు. అయితే తెలంగాణలో ఎన్నికలకు సమయం సమీపించడంతో ఏదో ఓ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే 2023 జూన్‌లో దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. దయాకర్ రెడ్డి అంత్యక్రియల్లో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొని పాడె మోశారు. రాజకీయ పరిణమాలతో రేవంత్‌రెడ్డి సమక్షంలో సీతమ్మ కాంగ్రెస్ గూటికి చేరారు.

రాజకీయ రంగ ప్రస్థానం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాల్లో కొత్తకోట దయాకర్‌రెడ్డి దంపతులు కీలకంగా వ్యవహరించారు. అమరచింత నియోజకవర్గం నుంచి దయాకర్‌రెడ్డి 1994, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో మక్తల్ నుంచి గెలుపొందారు. సీతమ్మ 1994లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2001లో దేవరకద్ర జెడ్పీటీసీగా విజయం సాధించిన ఆమె.. ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. 2009లో కొత్తగా ఏర్పడిన దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున సీతాదయాకర్ రెడ్డి పోటీచేసి.. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి స్వర్ణసుధాకర్‌రెడ్డిపై 19,034 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. 2014 శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీచేసిన ఆల వెంకటేశ్వరరెడ్డి చేతిలో ఆమె పరాజయం పొందారు.

➪ 2023 సెప్టెంబర్ 11న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, అప్పటి పీసీసీ చీఫ్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో సీతా దయాకర్‌రెడ్డి హస్తం గూటికి చేరారు. ఉమ్మడి రాష్ట్రంలోని 2009లో ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలిచి భార్యాభర్తలిద్దరూ కలిసి అసెంబ్లీలోకి ప్రవేశించి చరిత్ర సృష్టించారు.

వైద్యులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మెడికల్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం/ బిజినేపల్లి: వైద్యులు చట్టాలపై అవగాహన పెంచుకుంటే నేర పరిశోధనలో మెడికల్ సర్టిఫికెట్లపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని జిల్లా జడ్జి రాజేష్‌బాబు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యులు ఎంతో సేవ చేస్తున్నారని, మెడికల్ లీగల్ నేర పరిశోధనలో మెడికల్ సర్టిఫికెట్ల పాత్రపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోస్టుమార్టం నివేదికతోపాటు వైద్య సంస్థల్లో ర్యాగింగ్ పరిణామాలకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా శిక్షకు గురవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్ చదువు పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే చాలా కేసుల్లో వైద్యుల సహాయం అవసరం అవుతుందని చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి మాట్లాడుతూ లెక్చరర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో స్థిరపడి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సబిత ఎక్ఫై లా స్కూల్ ప్రొఫెసర్ దామోదర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్నల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంతరావు, సునీల్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో..

బిజినేపల్లి మండలంలోని వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా జడ్జి రాజేష్‌బాబు మాట్లాడుతూ నేటి సమాజంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రైతులు సర్టిఫైడ్ చేసిన వాటినే కొనేలా అవగాహన కల్పించాలని, వాటికి రశీదు తప్పనిసరిగా తీసుకునేలా చూడాలన్నారు. తద్వారా ఏదైనా కంపెనీ ద్వారా రైతులకు నష్టం వాటిల్లితే కోర్టులను ఆశ్రయించవచ్చన్నారు. మార్కెట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు తక్కువగా విక్రయించరాదని, అలా ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరంగా న్యాయం పొందడంపై జిల్లా న్యాయ సేవా సమితి కార్యదర్శి సబిత వివరించారు. మండలంలోని మంగనూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల అసోసియేట్ డీన్ సుధాకర్, శాస్త్రవేత్తలు సత్యనారాయణ, సునీల్ ప్రేమ్, న్యాయవాదులు రవికాంత్‌రావు, దామోదర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, శ్రీరామ్ ఆర్య, పరశురాములు పాల్గొన్నారు.

చిన్నారులకు సమగ్ర కంటి పరీక్షలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని అంగన్‌వాడీల పరిధిలోని ఆరేళ్లలోపు చిన్నారులకు సోమవారం నుంచి సమగ్ర కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని పీహెచ్‌సీల పర్యవేక్షణ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని 1,131 అంగన్‌వాడీ కేంద్రాల్లో 47,317 చిన్నారులకు ప్రాథమిక దశలోనే సమగ్ర కంటి పరీక్ష నిర్వహించి తగిన మందులతో చికిత్స నిర్వహించి.. కంటి అద్దాలు అందించడం వలన అంధత్వాన్ని నివారించగలమన్నారు. చిన్నారుల్లో విటమిన్-ఏ లోపం, మెల్ల కన్ను, టెరీజియం, హ్రస్వ దృష్టి, దీర్ఘ దృష్టి తదితర కంటి సమస్యలు వస్తాయని, వీటిని నివారించడానికి ప్రతి చిన్నారికి సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆర్‌బీఎస్‌కే సంచార వైద్య బృందం, నేత్రాధికారులు సంయుక్తంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం చిన్నారుల సమగ్ర కంటి పరీక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశాలు తమ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే సమగ్ర కంటి పరీక్ష శిబిరానికి చిన్నారులు హాజరయ్యేలా చూడాలన్నారు. శిశువులు, చిన్నారుల్లో ఎవరైనా టీకాకరణ చేయించుకోని వారు ఉంటే ఏప్రిల్, మే, జూన్ నెలల్లో టీకాకరణ క్యాచ్ అప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాసు, ప్రోగ్రాం అధికారి రవికుమార్, రాజశేఖర్, డీపీఓ రేణుయ్య, ఏపీఓలు మినహాజ్, శ్రీనివాసులు, నిరంజన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి తదితరులు

నాగర్‌కర్నూల్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతిఒక్కరికీ ఈ పథకాలను అందించే బాధ్యత అధికారులదేనని, ఎవరైనా పథకానికి దూరంగా ఉంటే, వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 150 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, 46 సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసి మాట్లాడారు. పేద కుటుంబాల్లో అమ్మాయిల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

■ జిల్లాకేంద్రంలో రూ.5 కోట్లతో నూతనంగా నిర్మించనున్న జిల్లా మహిళా సమాఖ్య భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ కార్యాలయ సమీపంలో అధునాతన సౌకర్యాలతో భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. మహిళా సంఘాలకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబం ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందన్నారు. అనంతరం ఎల్ఐసీ కార్యాలయం పక్కన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు, మాజీ కౌన్సిలర్లు సునేంద్ర, నిజాం తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

బిజినేపల్లి: ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు కీలకమైన ఘట్టం ఇంటర్ విద్య అని.. ఈ దశలో విద్యార్థులు తప్పటడుగులు వేస్తే జీవితాంతం సర్దుకుపోతూ బతకాల్సి వస్తుందని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా వార్షిక పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పే టీ-శాట్ ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని డీఈఓ బిజినేపల్లి కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో కలిసి వీక్షించారు. వీసీ అనంతరం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకొని.. అందుకు తగు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, శోభారాణి, నాగేందర్, ఎంఈఓ రఘునందన్‌రావు, ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి టీ-శాట్ వీక్షిస్తున్న డీఈఓ

క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడు బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంట్లో ఉరేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు.. స్థానిక బీసీ కాలనీకి చెందిన సాయికుమార్(20) డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


మధు(ఫైల్)

లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లికి చెందిన సొడమోని మధు(22) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 2వ తేదీన ద్విచక్ర వాహనంపై వరికోత మిషన్ కోసం అంబట్‌పల్లి వైపు తమ్ముడు సాయితో కలిసి వెళ్లాడు. ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో మధు తలకు బలమైన గాయం కాగా, సాయికి స్వల్ప గాయాలయ్యాయి. మధును నిమ్స్‌కు తరలించగా కోలుకోలేక చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతుడి తండ్రి సొడమోని శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తి..



ఎర్రవల్లి: రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు రైల్వే కానిస్టేబుల్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఇటిక్యాల మండలం పూడూరు–ఇటిక్యాల రైల్వేస్టేషన్ మధ్యలో కి.మీ. 204/2–3 వద్ద 45 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి గురువారం రాత్రి రైలులో నుంచి కిందపడి మృతి చెందినట్లు చెప్పారు. గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించినట్లు వివరించారు. మరిన్ని వివరాలకు గద్వాల రైల్వే పోలీస్ నంబర్ 83412 52529 సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ విద్యార్థి బలవన్మరణం


అరవింద్ (ఫైల్)

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట గ్రామంలో అరవింద్(20) అనే డిగ్రీ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తోకల తిరుపతయ్య కుమారుడు అరవింద్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఉగాది పండుగకు ఇంటికి వచ్చిన అరవింద్ ఇక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద ఎవరూ లేని సమయంలో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం

పాన్‌గల్: మండల కేంద్రంలోని పొల్కి చెరువులో శుక్రవారం 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మూడురోజుల కిందట చనిపోయి ఉంటాడని.. ఘటన స్థలంలో చెప్పులు, శాలువా, కల్లు ప్యాకెట్ కనిపించినట్లు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని జిల్లా ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని.. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 87126 70616, 87125 83613 సంప్రదించాలని సూచించారు.

వృద్ధురాలిపై దాడిలో ఇద్దరిపై కేసు నమోదు

పాన్‌గల్: వృద్ధురాలిపై దాడిచేసి గాయపర్చిన ఘటనపై శుక్రవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన ఆవుల బాలమ్మ అనే వృద్ధురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. వీరిద్దరికి పెళ్లిళ్లు కావడంతో వృద్ధురాలు ఆమె భర్త బాలస్వామి ఇద్దరు వేరుగా నివాసం ఉంటున్నారు. కుమారుడితో కుటుంబ విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదేక్రమంలో గతనెల 29వ తేదీన ఇంటి దగ్గరిలోని నల్లా వద్ద వృద్ధురాలు నీళ్లు పడుతున్న క్రమంలో కోడలు అనిత బిందెను పక్కకు తోసేసి దుర్భాషలాడింది. కుమారుడు ఆంజనేయులు వచ్చి ఇనుప రాడ్‌తో వృద్ధురాలి తలపై దాడి చేయగా రక్తగాయాలయ్యాయి. అనిత, ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని బాలమ్మ శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అపర భద్రాద్రి సిర్సనగండ్ల


సిర్సనగండ్లలోని దేవాలయం

నేటి నుంచి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు

- ఏకశిలపై వెలిసిన సీతారామచంద్ర స్వామి దేవాలయం
- ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణం
- ఏర్పాట్లు పూర్తిచేసిన పాలక వర్గం


సీతారామలక్ష్మణుల మూలవిరాట్

చారకొండ: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వాముల బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి 11వ తేదీ వరకు వారం పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ పుణ్యక్షేత్రం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని అయోధ్యనగర్ (గుట్ట)పైన 300 అడుగుల ఎత్తైన ఏకశిలపై సుమారు 60 ఎకరాల్లో ఉంది. బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కు లు తీర్చుకుంటారు. శ్రీరామనవమి రోజున భద్రాచలం మాదిరిగానే ఇక్కడ కూడా ప్రభుత్వ లాంఛనాలతో సీతారాముల కల్యాణం జరగనుంది.

ఆలయ చరిత్ర..

సిర్సనగండ్ల గుట్టపై సీతారామచంద్రస్వామి ఆలయం ఏర్పడకముందే ముక్కిడి పోచమ్మ, దత్తాత్రేయ దేవాలయాలు ఉండేవని.. గ్రామానికి చెందిన ధేరం రామయాజ్వీ నిత్యం పోచమ్మకు పూజలు చేసి అనంతరం దత్తాత్రేయ దేవాలయంలో తపస్సు చేసేవాడని చరిత్ర చెబుతోంది. ఒకరోజు అతనికి కలలో స్వామివారు దర్శనమిచ్చి ఖమ్మం జిల్లా పాల్వంచ రావిచేడు గ్రామంలో భాస్కరుడు అనే బ్రాహ్మణుడి ఇంటి పేరటిలో కాకార పాదుకింద విగ్రహాలు ఉన్నాయని.. తీసుకొచ్చి రోకలి శబ్దం కూడా వినిపించని పవిత్ర స్థలం సిర్సనగండ్ల గుట్టపై ప్రతిష్ఠించాలని చెప్పారని ప్రతీతి. ఆయనతో పాటు గ్రామపెద్దలు ఎద్దుల బండ్లపై అక్కడికి వెళ్లి రాజుగారికి వివరించి భటులతో కలిసి కాకర పాదులో తవ్వగా సీతారామచంద్రస్వామి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలు బయటపడ్డాయని.. వాటిని తీసుకొస్తుండగా గ్రామస్తులు అడ్డుకోవడంతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని అప్పజెప్పి సీతారామ లక్ష్మణుల విగ్రహాలు తీసుకొచ్చారని పెద్దలు చెబుతారు. వాటిని గుట్టపై ప్రతిష్ఠించే సమయంలో పోచమ్మ తల్లి ప్రత్యక్షమై వద్దని చెప్పడంతో సీతారామచంద్రస్వామి ప్రత్యక్షమై అమ్మవారిని శాంతించి భక్తులు నీ దర్శనం చేసుకున్న తర్వాతే మమ్మల్ని దర్శించుకుంటారని అభయం ఇవ్వడంతో అభయ రాముడిగా, క్షత్రీయ వంశానికి చెందినవారు కావడంతో రాజా రాముడిగా భక్తులకు దర్శనమిస్తున్నారని పురాణాలు చెబుతున్నాయి. నైరుతి భాగంలో పోచమ్మతల్లి, తూర్పుదిశలో సీతారామచంద్రస్వామి నిత్యం భక్తులకు దర్శనమిస్తున్నారు. 14వ శతాబ్దంలో రాచకొండ పద్మనాయకుల కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు దేవాలయంలోని ఒక స్తంభంపై అప్పటి లిపిలో చెక్కినట్లు నేటికీ ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

ప్రత్యేక బస్సులు..

బ్రహ్మోత్సవాలకు మహబూబ్‌నగర్, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం కల్వకుర్తి, అచ్చంపేట, దేవరకొండ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

మొదటిరోజు శనివారం మధ్యాహ్నం మాస కల్యాణం
- ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం
- సోమవారం ఉదయం కుంకుమార్చన, రాత్రి చిన్న రథం (పూల తేరు)
- మంగళవారం శివదత్తాత్రేయ పరశురామ, పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- బుధవారం ప్రత్యేక పూజలు, రాత్రి పెద్ద తేరు (రథోత్సవం)
- గురువారం పల్లకీసేవ, ఏకాంతసేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఈఓ స్వర్గం ఆంజనేయులు తెలిపారు.

వెండి కిరీటం బహూకరణ

సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలోని సీతమ్మ తల్లికి శుక్రవారం చారకొండ గ్రామానికి చెందిన బొడ్డు స్వాతి, నవీన్ దంపతులు రూ.40 వేల విలువైన 40 తులాల వెండి కిరీటాన్ని బహూకరించారు.


అర్చకులకు వెండి కిరీటం అందిస్తున్న దంపతులు

ఏర్పాట్లు పూర్తి ..

వారం పాటు సాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ పాలకవర్గం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలిరానుండగా.. ఇందుకుగాను ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేశారు. తాగునీటి ట్యాంకర్లు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.


ఆలయ ఆవరణలో వేసిన చలువ పందిళ్లు

అలంపూర్ పర్యాటక అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

- జోగుళాంబ ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి
- 20 ఎకరాల్లో పార్కింగ్, ఇతర వసతుల ఏర్పాటుకు చర్యలు
- ఆలయ విశిష్టత, చరిత్ర తెలియచేసే విధంగా చిత్రాలు
- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ వెల్లడి

అలంపూర్: దక్షిణకాశీ అలంపూర్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్ది.. పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అలంపూర్ ఆలయాలను సందర్శించారు. పరిసరాలు, పర్యాటకరంగంగా చేయాల్సిన అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు, వసతి కల్పన తదితర అంశాలపై కూలంకుషంగా చర్చించారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానానికి దిశానిర్దేశంగా జాతీయ రహదారి నుంచి ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను ఆయన పరిశీలించారు. జాతీయ రహదారిపై గల ఇటిక్యాలపాడు, మానవపాడు, అలంపూర్ క్రాస్‌రోడ్ల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను పరిశీలించి.. వాటి ఎత్తును పెంచడంతోపాటు, బోర్డులను ఆకర్షణీయంగా, సృజనాత్మకంగా రూపకల్పన చేయాలని సూచించారు. హైదరాబాద్ నుంచి ఎర్రవల్లి, ఎర్రవల్లి నుంచి అలంపూర్ మార్గంలోని కీలక ప్రదేశాల్లో సూచిక బోర్డులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా బోర్డుల్లో అలంపూర్ చరిత్ర, ఆలయ విశిష్టతను తెలియజేసే విధంగా చిత్రలేఖనాలు, ఆలయ సంస్కృతి ప్రతిబింబించేలా బొమ్మలు గీయించాలన్నారు. అలంపూర్ అండర్‌పాస్ ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మార్గంలోనే ఆధ్యాత్మిక భావన వచ్చేలా ప్రధాన కూడళ్లలో ఆకర్షణీయమైన చిత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అలంపూర్ రైల్వే గేట్ వద్ద నిర్మాణంలో ఉన్న ఆలయ ఆర్చిని పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు.

20 ఎకరాల్లో పార్కింగ్..

స్థానికంగా ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని పరిశీలించిన కలెక్టర్.. అక్కడ ఆలయాలకు వచ్చే వాహనాల పార్కింగ్‌తోపాటు భక్తుల వసతుల కల్పన కోసం, పబ్లిక్ టాయిలెట్లు, సమాచార కేంద్రంగా మార్చాలని, స్థలంలో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టి, పచ్చదనాన్ని పెంపొందించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. అనంతరం సంగమేశ్వర ఆలయాన్ని సందర్శించి పరిసరాల్లో పచ్చదనాన్ని పెంచాలని, మొక్కల సంరక్షణ కోసం నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థాన ప్రవేశ ద్వారాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. భక్తులు పరిశుభ్రమైన వాతావరణంలో దైవదర్శనం చేసుకునేలా, స్థానిక వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, పార్కింగ్ నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం పాపనాశనం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, ఆర్కిటెక్టు సూర్యనారాయణమూర్తి, శ్రీలేఖ, కేంద్ర పురావస్తు శాఖ అధికారి రోహిణి పాండే, ఆర్కియాలజీ ఏడీ నాగలక్ష్మి, ఈఓ పురేందర్, డీపీఓ నాగేంద్రం, తహసీల్దార్లు ప్రభాకర్, మంజుల, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

6 క్వింటాళ్ల నల్లబెల్లం, 30 కిలోల పటిక స్వాధీనం


పట్టుబడిన నల్లబెల్లం, పటిక, సారా

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల, చారకొండ, అగ్రహారం తండా, ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు శుక్రవారం సారా స్థవరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో అగ్రహారంతండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బస్తాలు దాదాపుగా 6 క్వింటాళ్ల నల్లబెల్లం, 30 కిలోల పటిక, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. అదే తండాకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సిర్సనగండ్ల జాతర సందర్భంగా గ్రామాల్లో కాని, జాతర సమీపంలో నాటుసారా, మద్యం నిషేధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శారద, సిబ్బంది రామకృష్ణ, రఘు, మహేష్, భీమమ్మ, నార్య ఉన్నారు.

హుండీలో నగదు అపహరణపై ఫిర్యాదు

గద్వాల క్రైం: ఆలయ హుండీలో నగదు అపహరణ సంఘటనపై ఆలయ ఈఓ పురేందర్ గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల మండలంలోని జములమ్మ ఆలయంలో గత నెల 28న ఆలయ కమిటీ, ఈఓ, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. అయితే ఆలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి రూ.లక్ష నగదు కాజేసినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేపట్టగా నగదు అపహరించినట్లు సదరు ఉద్యోగి అంగీకరించినట్లు సమాచారం. దీంతో అపహరించిన నగదును ఈ నెల 1న అందరి సమక్షంలో ఆలయ హుండీలో వేయించగా.. ఈ విషయంపై పత్రికల్లో కథనం ప్రచురితమైంది. దీంతో న్యాయ విచారణకు ఆదేశాలు రావడంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఈఓ పురేందర్ పేర్కొన్నారు.

నేటికీ చిక్కని ఆచూకీ


సొరంగం వద్ద జేపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో 42 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- టీబీఎం భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటికి
- పూర్తైన కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ పనులు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ)సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. సొరంగంలో చిక్కుకున్న వారిని బయటకు తెచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 22న సొరంగం పైకప్పు కూలిన ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు ప్రమాదవశాత్తు చిక్కుకోగా ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. 42 రోజులుగా మిగిలిన ఆరుగురు కార్మికుల కోసం సొరంగంలో అణువణువునా వెతుకులాట కొనసాగిస్తున్నారు. సొరంగం లోపల త్వవకాలు చేపడుతూ టీబీఎం భాగాలు స్టీల్, మట్టి, బురద, రాళ్లను వెలికితీసి బయటకు తరలిస్తున్నారు. టీబీఎం భాగాలను దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది ప్లాస్మా కట్టర్‌తో కట్‌చేసి లోకో ట్రైన్ ద్వారా బయటకు పంపిస్తున్నారు. నాలుగు ఎస్కవేటర్ల సహాయంతో మట్టిని తవ్వి కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి తీసుకువస్తున్నారు.

సహాయక చర్యలు వేగవంతం

సహాయక బృందాలకు కేటాయించిన పనిని పూర్తిస్థాయిలో చేపడుతూ సహాయక చర్యలు వేగవంతం చేశామని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. శుక్రవారం జేపీ కంపెనీ కార్యాలయంలో ఉన్నతాధికారులు, ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి సుదర్శన్‌రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేటి చంద్రం, జేపీ కంపెనీ ప్రతినిధులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ కన్వేయర్ బెల్టు పనులు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. సొరంగం లోపల 24గంటలు ఐదు ఎస్కవేటర్ల స్టీల్ భాగాలను, ప్రమాద ప్రదేశంలో భారీగా ఉన్న రాళ్లను లోకో ట్రైన్ ప్లాట్‌ఫాం పైకి తరలించి మట్టి త్వవకాలు చేపడుతున్నామన్నారు. సొరంగం లోపల నీటిఊటను నిరంతరం బయటకు పంపింగ్ చేస్తున్నామని చెప్పారు. సహాయక బృందాలకు అవసరమైన వసతులు కల్పిస్తూ ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

డీసీఎం ఢీకొనడంతో లారీ బోల్తా


కనిమెట్ట సమీపంలో బోల్తా పడిన లారీ

కొత్తకోట రూరల్: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి డీసీఎం ఢీకొనడంతో లారీ బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున జాతీయ రహదారి 44పై చోటుచేసుకొంది. లారీ డ్రైవర్ శివ తెలిపిన వివరాలు.. బెంగుళూర్ నుంచి ద్రాక్ష పండ్లను లోడ్ చేసుకొని కశ్మీర్‌కు వెళ్తున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కనిమెట్ట సమీపంలోకి రాగానే కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. లారీ రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. లారీలో ఉన్న డ్రైవర్లు శివ, కృష్ణతో పాటు ద్రాక్షపండ్ల యజమాని స్వామికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసునని, ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

రామన్‌పాడుకు నీటి సరఫరా నిలిపివేత

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,016 అడుగులకు చేరిందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశామన్నారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 16 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని కుడి, ఎడమ కాల్వల ద్వారా 48 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఆయన చెప్పారు.

ఫిల్టర్ ఇసుక రీచ్ పరిశీలన


ఫిల్టర్ ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ శివారులో జరుగుతున్న ఫిల్టర్ ఇసుక తయారీ ప్రదేశాన్ని తహసీల్దార్ సుగుణ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌నాయుడు పోలీసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా ఫిల్టర్ ఇసుక తయారు చేసి విక్రయిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మామిడిమాడ శివారులోని నేరెడు చెరువులో పెద్ద ఎత్తున ఫిల్టర్ ఇసుక దందా జరిగినట్లు అక్కడి పరిస్థితులను చూస్తే తెలుస్తుందని తెలిపారు.

అధికారుల హెచ్చరికలు బేఖాతర్

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు ఫిల్టర్ ఇసుక ఉపయోగిస్తున్నట్లు సమాచారం రావడంతో తహసీల్దార్, పీఆర్ ఏఈ రమేష్‌నాయుడు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అది ఫిల్టర్ ఇసుకగా గుర్తించి దానిని ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించరాదని అక్కడ నిర్మాణాలు చేస్తున్న వారిని ఆదేశించారు. అధికారులు అక్కడి నుంచి వెళ్లిన కొంతసేపటికే యథావిధిగా ఫిల్టర్ ఇసుకతోనే ఇళ్ల నిర్మాణాలు సాయంత్రం వరకు కొనసాగించారు. ఈ విషయమై పీఆర్ ఏఈ రమేష్ నాయుడును వివరణ కోరగా ఫిల్టర్ ఇసుకతో నిర్మాణాలు చేపట్టొదని సూచించామని, వారు అలాగే నిర్మాణాలు చేపడితే ఎంబీ చేయకుండా నిలిపివేస్తామన్నారు.

ఇసుక డంపు స్వాధీనం



కోస్గి: అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును శుక్రవారం రెవెన్యూ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కడంపల్లి వాగులో 100 ట్రిప్పులకు పైగా ఇసుక నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో తహసీల్దార్ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పట్టుబడిన ఇసుకను చంద్రవంచలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తరలించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సిబ్బందికి షిఫ్టుల వారీగా విధులు కేటాయించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని వివరించారు. ఆర్‌ఐలు సుభాష్ రెడ్డి, లింగారెడ్డి, జేఏ హన్మంతు, సిబ్బంది వెంకట్రాములు, బుగ్గప్ప, వెంకటయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రేమించాడని యువకుడిపై దాడి

నవాబుపేట: యువతిని ప్రేమించాడన్న కారణంతో యువకుడిపై యువతి కుటుంబీకులు దాడిచేసి గాయపర్చిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రమ్ కథనం మేరకు.. మండలంలోని పల్లెగడ్డకు చెందిన అరవింద్ జిల్లాకేంద్రంలోని పాత పాలమూర్‌కు చెందిన యువతిని ప్రేమిస్తున్నట్లు యువతి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు తెలిసింది. దీంతో శుక్రవారం యువతికి సంబంధించిన వ్యక్తులు పల్లెగడ్డకు వచ్చి మాట్లాడదాం రమ్మంటూ అరవింద్‌ను గ్రామం బయటకు తీసుకొచ్చి మూకుమ్మడిగా దాడి చేశారు. తీవ్ర గాయాలతో స్పృహ తప్పి పడిపోగా అక్కడ ఉన్న కొందరు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో పోలీసు వాహనం అక్కడికి చేరుకోగా దాడిచేసిన వ్యక్తులు పరారయ్యారు. వాహనాలను ఘటన స్థలంలో వదిలిపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.